సాక్షి
జగిత్యాల
మంగళవారం । 16 । మే । 2023



ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రంతోపాటు అనుబంధ ఆలయాల్లో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది.



కంకాలమ్మ బోనాలు

సారంగాపూర్ : కోనాపూర్ శ్రీ కంకాలమ్మ – శ్రీకేతాశ్వరస్వామికి మహేంద్రులు(మేదరులు) బోనాలతో నైవేద్యం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
44.6/36.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రోజంతా ఎండగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై స్పందిస్తాం

జగిత్యాలక్రైం: గ్రీవెన్స్ సెల్ ద్వారా అందే ప్రతీ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ భాస్కర్ అన్నారు. గ్రీవెన్స్ డేలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది నుంచి దరఖాస్తులను నేరుగా స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సంబంధిత, ఫైనాన్స్ సమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, గల్ఫ్ మోసాలపై ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూ, అసాంఘిక శక్తులు, నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ భాస్కర్ సూచించారు.

రోడ్డెక్కిన రైతులు



నిరసన తెలుపుతున్న రైతులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తిప్పన్నపేట ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని పేర్కొంటూ రైతులు సోమవారం ఉదయం జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై బైఠాయించారు. రోడ్డుపై ధాన్యం బస్తాలు వేసి రాస్తారోకో చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నెలరోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న రూరల్ ఏఎస్సై శంకరయ్య తిప్పన్నపేటకు చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోళ్లు వేగవంతం చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

బంద్ ప్రశాంతం



నిర్మానుష్యంగా మారిన ధర్మపురి మెయిన్‌రోడ్డు

ధర్మపురి: జగిత్యాల రూరల్ ఎస్సై సస్పెండ్‌కు నిరసనగా విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పట్టణంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు, టీకొట్లు, టిఫిన్ సెంటర్లు, పాన్ షాపులు, హోటళ్లు మూసిఉంచారు. సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్సై కిరణ్‌కుమార్ తన పోలీసు సిబ్బందితో బందోబస్తు చేపట్టారు.


కొడిమ్యాలలో..

మల్యాల(చొప్పదండి): ఎస్సై అనిల్ సస్పెన్షన్‌ను నిరసిస్తూ కొడిమ్యాలలో హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. నాయకులు కోల అనిల్, గొల్కొండ రాజు, మంచాల భూమేశ్, అంకం మహేందర్, ఎర్రోజు శ్రీధర్, బైరి కార్తీక్, రవి, వాసు, మహేందర్, నిఖిల్, వికాస్, వేణు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

కథలాపూర్(వేములవాడ): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్) బృందం సోమవారం తనిఖీ చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని విభాగాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేసింది. పీహెచ్‌సీ పనితీరు అంచనా వేసి కేంద్రప్రభుత్వానికి నివేదిక అందించనుంది. నివేదిక ఆధారంగా పీహెచ్‌సీకి ప్రత్యేకంగా నిధులు వస్తాయని అధికారులు పేర్కొన్నారు. తనిఖీల్లో ఎన్‌క్వాస్ అధికారులు మనోజ్ మిశ్రా, కార్డిలే వైశాలి దత్తాత్రయ, వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు శ్రీనివాస్, ఎండీ సమియొద్దీన్, స్థానిక వైద్యాధికారి సింధూజ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు



ముత్యంపేటలో బోల్తాపడిన ఆటో

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని ముత్యంపేట శివారు రైతువేదిక సమీపంలో సోమవారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు ఆటోలో మల్లాపూర్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే వారసంత(అంగడి)కు వచ్చి తిరిగి ఆటోలో వెళ్తుండగా.. ముత్యంపేట శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మల్లాపూర్ పోలీసులు ఘటనస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

మొన్నటి వరకు కురిసిన అకాల వర్షాలు, వడగళ్లతో మామిడి రైతులు పంట తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన జిల్లా వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖల అధికారులు.. జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. దెబ్బతిన్న మామిడితోటలు పరిశీలించారు. ఈదురుగాలులు, వడగళ్ల ధాటికి మామిడికాయలు పూర్తిగా రాలిపోయినట్లు గుర్తించారు. సుమారు 80శాతం పంట నష్టం జరిగినట్లు నివేదిక రూపొందించారు. ఇటీవల ప్రభుత్వానికి నివేదించారు.



వర్షాలకు రాలిన మామిడికాయలు

పరిహారం.. పరిహాసమేనా?

- 'అకాలం'తో దెబ్బతిన్న మామిడి
- 80శాతం పంట కోల్పోయిన అన్నదాతలు
- నష్టంపై నివేదిక రూపొందించిన అధికారులు
- సర్కారు నిర్ణయంపైనే అన్నదాతల ఆశలు

సారంగాపూర్(జగిత్యాల): మామిడి రైతులపై ప్రకృతి ఏటా కన్నెర్రజేస్తూనే ఉంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పూతనుంచి కాతవరకు కంటికి రెప్పలా కాపాడుకుంటుండగా.. అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలు, బలమైన ఈదురుగాలులు, వడగళ్లు పంటను నీటిపాలు చేస్తున్నాయి. గత ఏప్రిల్‌లో కురిసిన భారీవర్షాలు కూడా అన్నదాతకు కన్నీళ్లే మిగిల్చాయి.

రెండు మండలాల్లో అత్యధికం..

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కలిపి సుమారు 512 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఈ పంటకు పెద్దగా ప్రోత్సాహం ఏమీ అందడంలేదు. సాగునీటి సమస్యను అధిగమించేందుకు రైతులు వరికి బదులు మామిడిని ఎంచుకుంటున్నారు. కూలి రేట్లు, ట్రాక్టర్ అద్దె, రసాయనిక, సేంద్రియ ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. తద్వారా ఒక్కో ఎకరాపై ఒక్కో రైతు సుమారు రూ.35వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి పెడుతున్నాడు.

పంట చేతికొచ్చే సమయంలో..

మామిడికాయలు చేతికి వచ్చే సమయంలో.. గత మార్చి, ఏప్రిల్‌లో కురిసిన ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షాలు పంటను తీవ్రంగా దెబ్బతీశాయి. కాయలు తెంపేందుకు అన్నీసిద్ధం చేసి.. తెల్లవారితే పనులు ప్రారంభించే ఆలోచనలో ఉండగానే.. అదేరాత్రి అనూహ్యంగా అకాలవర్షం కురవడం, మామిడికాయలు నేలరాలిపోవడంతో అన్నదాతలు ఆగమయ్యారు. మిగిలిన కాయలను బహిరంగ మార్కెట్‌కు తీసుకెళ్తే.. కిలోకు రూ.50 పలకాల్సిన ధర.. రూ.20 కూడా రావడంలేదని రైతులు చెబుతున్నారు. వర్షాలకు రాలిన కాయలు మురిగిపోగా, మిగిలినవి పగిలాయని, ఇలాంటివి కిలో రూ.5 కూడా ధర పలకడంలేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

347 ఎకరాల్లో నష్టం..

అకాల వర్షాలతో సారంగాపూర్ మండలంలో 195 ఎకరాలు, బీర్‌పూర్ మండలంలో సుమారు 152 ఎకరాల్లోని మామిడికాయలు రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. నివేదికను రూపొందించి ఉన్నతాధికారులు అందజేశారు.

పరిహారం కోసం ఎదురుచూపు

ప్రకృతి వైపరీత్యాలతో మామిడి దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. బాధిత రైతుల్లో సంతోషం వ్యక్తమైంది. కానీ, ఇప్పటిదాకా పరిహారం ప్రక్రియకు సంబంధించిన ఎలాంటి సమాచారం రాకపోవడంతో రైతుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు కూడా ఇప్పటిదాకా నోరు మెదపడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి



మామిడికాయలు నష్టపోయిన మాకు పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడం సంతోషమే. కానీ, ఎకరాకు రూ.25 వేల వరకు పరిహారం అందించాలి. అదికూడా ఈనెలాఖరులోగా అందిస్తే వచ్చే వానాకాలం పంటల పెట్టుబడికి అక్కరకొస్తాయి. మాతోపాటు తోటలు గుత్తకు పట్టిన వారిని కూడా ఆర్థికంగా ఆదుకోవాలి. – గడ్డం మహిపాల్‌రెడ్డి, లక్ష్మీదేవిపల్లి

ప్రభుత్వానికి నివేదించాం



అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి పంటలపై ఇటీవల సర్వే చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేశాం. నష్టం వివరాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. రైతులు ఆందోళన చెందవద్దు, ప్రభుత్వం పరిహారం అందిస్తుంది.

– తిరుపతినాయక్, వ్యవసాయాధికారి, సారంగాపూర్



చెట్ల కింద సేదదీరుతున్న అర్జీదారులు

నీళ్లు లేవు.. దాహం తీరదు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా



ర్యాంప్ లేక మెట్లపై వెళ్తున్న దివ్యాంగుడు

- అసౌకర్యాల మధ్య అర్జీదారులు
- దూరప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బందులపాలు
- ప్రజావాణిపై అసౌకర్యాల ఎఫెక్ట్

జగిత్యాల: అసలే ఎండాకాలం. ఎండలు మండిపోతున్నాయి. దాహం కోసం ప్రజలు తపిస్తున్నారు. అయినా, కలెక్టరేట్‌లో సోమవారం చేపట్టిన ప్రజావాణిలో కనీస సౌకర్యాలు కల్పించలేదు. కలెక్టరేట్ మొత్తంగా పచ్చదనం పర్చుకుని, ఆహ్లాద వాతావరణం పంచుతూ ఉన్నా.. మౌలిక వసతులు లేవు. దీంతో ప్రజావాణికి హాజరైన అభాగ్యులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్ నుంచి దాదాపు కి.మీ. దూరం కలెక్టరేట్ ఉంది. అక్కడి దాకా ఆటోలు, ప్రైవేట్ వాహనాలు తప్ప ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. అధిక వ్యయ ప్రయాసలకోర్చి ప్రజావాణికి చేరుకున్నా తాగేందుకు చుక్క నీరు లభించని పరిస్థితి నెలకొంది.

సమస్యలు పరిష్కరించండి

ప్రజావాణి ద్వారా స్వీకరించే అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభాగ్యుల నుంచి 54 ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. అడిషనల్ కలెక్టర్ లత, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో మోసాలు..

ధాన్యం తూకంలో మోసాలు చోటుచేసుకుంటున్నాయని, కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ప్రజావాణిలో వారు ఒక వినతిపత్రం అందజేశారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఒక్కో విధంగా ధాన్యం తూకం వేస్తున్నారని ఆరోపించారు. మిల్లుకు చేరాక ధాన్యంలో మళ్లీ కోత విధిస్తున్నారని వారు ఆరోపించారు. ఇలాంటి మోసాలను అరికట్టి, కొనుగోళ్లను వేగంగా పూర్తిచేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జలేందర్, కంచర్ల అఖిల్, రాకేశ్, తిరుపతిరెడ్డి, రాజు పాల్గొన్నారు.



ఈ మహిళ పేరు స్వప్న. వెల్గటూర్ మండలం ముంజంపల్లి స్వగ్రామం. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని ప్రజావాణి వేదిక వద్దకు చేరుకుంది. తాగడానికి సమీపంలో ఎక్కడా నీరు దొరకలేదు. దాహంతో తపించిపోయింది.

రైతులను ఆదుకోండి

ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారని, అన్నదాతలను ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు జరుగుతున్న నష్టాలపై వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా నిర్వాహకులు కొనుగోలు చేయడంలేదని ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిరాజొద్దీన్ మన్సూర్, నాయకుడు వాకాటి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- పకడ్బందీగా పరీక్ష నిర్వహణ
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో పాలీసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 17న పాలిసెట్ నిర్వహిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 3,566 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల కోసం జగిత్యాల పట్టణంలో 8, కోరుట్ల పట్టణంలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు సాఫీగా నిర్వహించేందుకు ముగ్గురు రూట్ ఆఫీసర్లు, 13 మంది సీఎస్‌లు, మరో 13 మంది పరిశీలకులు, 220 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు. పరీక్ష కేంద్రానికి ఒక ఆరోగ్య సిబ్బంది, పోలీసు సిబ్బందిని కేటాయించామని కలెక్టర్ అన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా సమన్వయకర్తగా ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ వ్యవహరించనున్నారని చెప్పారు. రాష్ట్రస్థాయి పరిశీలకులుగా నిజామాబాద్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ వ్యవహరిస్తారని అన్నారు. విద్యార్థులను ఉదయం 9 గంటల నుంచే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరని వివరించారు. పరీక్ష కేంద్రానికి సమయానికి విద్యార్థులు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడుపుతారని వెల్లడించారు. తప్పనిసరిగా హాల్‌టికెట్‌తోపాటు పరీక్ష ప్యాడ్, హెచ్‌బీ పెన్సిల్, బ్లూ/బ్లాక్ పెన్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, శానిటేషన్, తాగునీటి వసతి అందుబాటులో ఉంచుటామని కలెక్టర్ వివరించారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సోమవారం గరిష్టంగా 44.6 డిగ్రీలు, కనిష్టంగా 36 డిగ్రీల సెల్సియస్ నమోదు కావడంతో ఎండతీవ్రత పెరిగింది. వేడిని తట్టుకోలేక జిల్లావాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. దీనికితోడు, గాలిలో తేమశాతం తగ్గడంతో ఉక్కపోత ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం సమయంలోనూ బలమైన వడగాడ్పులు వీచాయి. గరిష్ట ఉష్ణోగ్రతల వివరాలు(డిగ్రీల సెల్సియస్‌లో)..

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రతలు
ఇబ్రహీంపట్నం	గోధూర్	44.6
మల్లాపూర్	మల్లాపూర్	44.5
ధర్మపురి	జైనా	44.3
మల్లాపూర్	రాఘవపేట	44.2
బీర్‌పూర్	కొల్వాయి	43.6
ధర్మపురి	బుగ్గారంపల్లి	43.3
మెట్‌పల్లి	మెట్‌పల్లి	42.2
ధర్మపురి	నేరెళ్ల	42.2

సంపదను కాపాడేవారే దేశభక్తులు

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కథలాపూర్(వేములవాడ): ఎల్‌ఐసీ, బొగ్గు, విశాఖ ఉక్కులాంటి దేశ సంపదను కాపాడేవారే నిజమైన దేశభక్తులని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. సోమవారం దూలూర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కథలాపూర్‌లో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం, ఊట్‌పెల్లి, పెగ్గెర్ల గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. చింతకుంటలో పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. వివిధ గ్రామాలకు చెందిన 29 మందికి కల్యాణలక్ష్మి పథకం చెక్కులు పంపిణీ చేశారు. మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ రాయితీ డబ్బులు రూ.1.58 కోట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయాలని కేంద్రప్రభుత్వం చూస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచాయని ఇతర రాష్ట్రాల నేతలు కితాబిచ్చారని అన్నారు. దళితబంధు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో 10 నుంచి 15 మందికి అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్య, ప్రజాప్రతినిధులు, నాయకులు కొండ ఆంజనేయులు, కిరణ్‌రావు, గంగప్రసాద్, బొడ్డు బాలు, బద్దం మహేందర్‌రెడ్డి, నల్లూరి కిషన్, నల్ల గంగాధర్, జెల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కేజీబీవీలకు మంచిరోజులు

- పెరిగిన మెస్ చార్జీలు
- బాలికలకు నాణ్యమైన భోజనం
- ఉద్యోగులకు పరస్పర బదిలీ అవకాశం
- సిబ్బందిలోనూ ఉత్సాహం

కథలాపూర్(వేములవాడ): ఉచిత వసతి, మంచి బోధన అందించే కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ)పేద విద్యార్థినులకు వరంగా మారాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరిన్ని వసతులు అందుబాటులోకి వస్తాయి. ఇటీవల మెస్ చార్జీలు పెంచుతున్నట్లు సర్కార్ ప్రకటించింది. తద్వారా బాలికలకు నాణ్యమైన భోజనం అందుతుందని భావిస్తున్నారు. ఇది బాలికల సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తుందని అంటున్నారు. బాలికల్లో రక్తహీనత, ఇతరత్రా వ్యాధులు దరిచేరవని ఇందుకోసం అవసరమైన ఇమ్యూనిటీ పెంపొందుతుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాదు.. ఉద్యోగుల పరస్పర బదిలీలకు అవకాశం కల్పించడంతో మరింత ఉత్సాహంతో పనిచేస్తారని విద్యాభిమానులు పేర్కొంటున్నారు. దీంతో కేజీబీవీలకు మంచిరోజులు వచ్చాయని పేదల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

14 కేజీబీవీలు..

2,600 మంది బాలికలకు అవకాశం..

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు, 380 గ్రామాలు ఉన్నాయి.
- వీటి పరిధిలో 14 కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు ఉన్నాయి.
- జిల్లాలోని 9 కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్య అందిస్తున్నారు.
- జగిత్యాల అర్బన్, వెల్గటూర్, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, రాయికల్ కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువు చెబుతున్నారు.
- జిల్లాలోని మొత్తం 14 కేజీబీవీల్లో ఏటా 2,600 మంది విద్యార్థినులకు ఉచిత విద్యాబోధన, వసతి, పౌష్టికాహారం అందుతోంది.



విద్యార్థినుల నుంచి ప్రవేశాలు తీసుకుంటున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ టీచర్లు

పెరిగిన మెస్ చార్జీలు..

ఒక్కో బాలికకు మెస్‌చార్జీ నెలకు రూ.1,040 ప్రభుత్వం చెల్లించేది. ఈసొమ్ము సరిపోవడం లేదని చెబుతూ బాలికలకు నాసిరకం భోజనం వడ్డించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, ఈ విద్యాసంవత్సరం నుంచి మెస్ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.1,225 చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తద్వారా బాలికలకు నాణ్యమైన భోజనం అందుతుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షించి నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇవేకాకుండా విద్యార్థినులకు కాస్మొటిక్ చార్జీలు నేరుగా బ్యాంక్ ఖాతాల్లోనే జమ అవుతున్నాయి. కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి పరస్పర బదిలీలకు అవకాశం ఇవ్వడంతో వారు మరింత ఉత్సాహంగా విధులు నిర్వర్తిస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రవేశాలకు స్పెషల్ డ్రైవ్



కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందిస్తున్నాం. విద్యార్థినులను విద్యాలయంలో చేర్పించాలని టీచర్లతో కలిసి గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. బాలికల వివరాలు తెలిస్తే వారి ఇళ్లకు వెళ్లి అడ్మిషన్లు తీసుకుంటున్నాం. కేజీబీవీల్లో ఉచితంగా పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫారమ్‌లు, కాస్మొటిక్ చార్జీలు అందిస్తున్నాం. ఈ వసతులను వివరిస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి స్పందన వస్తోంది.

– గీత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, కథలాపూర్

కేజీబీవీల్లో చేర్పించండి

కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థినిలను చేర్పించేందుకు ప్రజాప్రతినిధులు, విద్యావంతులు ప్రోత్సహించాలి. పేదలు, తల్లిదండ్రుల్లో ఒకరు లేనివారి పిల్లలు, అనాథలకు అడ్మిషన్లలో ప్రాధాన్యత ఉంటుంది. విద్యార్థినులకు ఉచితంగా మంచి విద్య, నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలి.

– అనుపమ, జీసీడీవో, జగిత్యాల

క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్ యాస్మిన్ బాషాతో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

జగిత్యాల/కోరుట్ల: నియోజకవర్గంలో జరుగుతున్న అ భివృద్ధి పనులను వేగవంతం చేసేలా చూ డాలని కలెక్టర్‌ను కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరారు. పలు అభివృద్ధి అంశాలపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నామని మరింత ముందుకు వెళ్లేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లత ఉన్నారు.

వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన పాలోజీ శ్రీధర్ (45) వ్యక్తి మృతిచెందాడు. కృష్ణానగర్‌కు చెందిన శ్రీధర్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొన్నిరోజులుగా మద్యంకు బానిసై నిత్యం గొడవ పడుతుండడంతో తల్లితో పాటు భార్య, పిల్లలు ఇంటినుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో అతిగా మద్యం తాగి పడుకోగా రెండు రోజులుగా ఇంటి తలుపులు తెరవలేదు. దీంతో సోమవారం పక్కింటి వారికి దుర్వాసన రావడంతో తలుపులు తెరిచి చూడగా మృతిచెందాడు. అతిగా మద్యం తాగి నీళ్లులేకపోవడంతో తన సోదరుడు మృతిచెందాడని, మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు పట్టణ ఏఎస్సై నయీమొద్దీన్ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కోరుట్ల: పట్టణంలోని చిన్నతోట వాడకు చెందిన జిల్లా రాజు(40) అనే వ్యక్తి అయిలాపూర్ రోడ్‌లోని కేరళా హైస్కూల్ వెనుక చెట్టుకు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం 11గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు వెళ్లిన రాజు సాయంత్రం చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న రాజుకు భార్య సుమలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియలేదు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



ట్రాక్టర్ ఢీ కొని మృతిచెందిన గంగరాజం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బదినపెల్లి గంగరాజం(60) మృతిచెందాడు. స్థానికుల తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగరాజం కుమార్తె సుమలతతో కలిసి గొర్రెపల్లిలో శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామమైన వేంపల్లికి బైక్‌పై వస్తుండగా, ఎదురుగా అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి గంగరాజం అక్కడిక్కడే మృతిచెందగా, సుమలత స్వల్పంగా గాయపడింది. విషయం తెలుసుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి ఘటన స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడి భార్య గంగరాజం ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్లక్ష్యమే.. నిండు ప్రాణాలు తీస్తోంది

- ప్రతీ సీజన్‌లో నాలుగైదు 'హార్వెస్టర్' ప్రమాదాలు
- కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటుంటే..మరికొందరు తీవ్రగాయాలతో మంచానికే..
- ముందస్తుగానే పనులు చేసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు



వరి పొలం కోస్తున్న హార్వెస్టర్

జగిత్యాలఅగ్రికల్చర్: వరిపంటలు కోసేందుకు ముందస్తుగా చేయాల్సిన పనులను హార్వెస్టర్ల ముందే చేస్తుండడంతో రైతులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇలా ప్రతీ సీజన్‌లో ఐదుగురు రైతులు స్వయంకృపారాధంతో మృత్యువాత పడుతుంటే, మరికొందరు కాళ్లు, చేతులు పోగొట్టుకుని కుటుంబీకులకు పుట్టెడు దుఖాన్ని మిగుల్చుతున్నారు. తాజాగా ఆదివారం జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో ఇంటర్ విద్యార్థి రంజిత్ యువకుడు పొలం కోయించేందుకు వెళ్లిన తండ్రికి ఆసరాగా వెళ్లి, హార్వెస్టర్‌లో చిక్కుకుని మృత్యువాడ పడ్డారు.

రైతుల నిర్లక్ష్యంతోనే..

పంట పొలాల్లో గట్ల వెంట పంటను కోసేందుకు హార్వెస్టర్లకు అధిక సమయం పడుతోంది. ఈక్రమంలో గట్లవెంట హద్దురాళ్లు ఉండడంతో హార్వేస్టర్ బ్లేడ్లు విరిగిపోతాయని డ్రైవర్లు బయపడుతుంటారు. ఈ నేపథ్యంలో గట్ల వెంట పూర్తిస్థాయిలో పంటలు కోయడం అసాధ్యంగా మారుతుంది. దీంతో గతంలో రైతులు పంటలు కోయించేందుకు ఒకరోజు ముందుగానే పొలం గట్లవెంట పంటను కొంతమేర కోసేస్తుండేవారు. పొలం మధ్యలో రాళ్లు ఉన్నప్పటికీ హార్వెస్టర్ డ్రైవర్‌కు రాళ్లు కనబడేలా చుట్టూ పంట కోస్తుండేవారు. అయితే ఇటీవల రైతులు పొలానికి హార్వెస్టర్ వచ్చినప్పుడే అన్ని పనులు చేస్తుండడంతో రైతుల దుస్తులు మిషన్‌లోకి లాక్కోవడంతో మృత్యువాత పడుతున్నారు.

ప్రమాదాలను ఎలా నివారించాలి..

హార్వేస్టర్ పొలానికి రాకముందే అన్ని పనులు చేసుకోవాలి. లేదంటే, పొలం ఒక్క మడిలో హార్వెస్టర్ నడిచేటప్పుడు మరో మడిలో పనులు చేసుకోవాలి. హార్వెస్టర్ నడిచేటప్పుడు వెనుక భాగం, ముందు భాగం, పక్క భాగంలో ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదు. వృద్ధాప్యంలో ఉన్న రైతులు హార్వెస్టర్ వైపు వెళ్లకూడదు. చాలా మంది రైతులు మోకాళ్ల నొప్పులతో హార్వెస్టర్ తమవైపు వచ్చినప్పటికీ పరుగెత్తే పరిస్థితి ఉండదు. దీనికి తోడు, పొలంలో ఏమైనా బురద ఉంటే మరింత కాలు దిగబడి, కనీసం నడిచే అవకాశం ఉండదు. హార్వెస్టర్‌ను పొలానికి తీసుకెళ్లిన తర్వాత డ్రైవర్‌కు అన్నిజాగ్రత్తలు చెప్పి, దూరంగా ఉండడం అన్నివిధాల శ్రేయస్కరం.

చెబితే రైతులు వినరు



రైతులకు ముందస్తుగా అన్ని జాగ్రత్తలు చెబుతుంటాం అయినప్పటికీ రైతులు వినరు. ఏమికాదనే దీమాతో హార్వెస్టర్ వెంట వస్తు మిగిలిన గొలుసులను కోస్తుంటారు. అజాగ్రత్తగా ఉంటూ మృత్యువాత పడుతున్నారు. – ఎడమల సత్యం, హార్వేస్టర్ యజమాని, జగిత్యాల

హార్వేస్టర్ నడిచేటప్పుడు వెళ్లొద్దు



హార్వెస్టర్ అత్యధిక ఇంజన్ సామర్థ్యంతో నడుస్తుంటుంది. ఎత్తుగా ఉండడంతో కిందనున్న వాళ్లు కనబడే అవకాశం ఉండదు. ఇంజిన్ శబ్దం ఎక్కువగా వస్తుండడంతో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కేకలు వేసినా వినబడే పరిస్థితి ఉండదు. కాబట్టి హార్వేస్టర్ నడిచేటప్పుడు అటువైపు వెళ్లొద్దు. – ప్రజ్ఞ, ఇంజినీరింగ్ శాస్త్రవేత్త, పొలాస

ఉపాధి వేటలో ఆగిన గుండె



చాంద్‌పాషాకు వినతిపత్రం సమర్పిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మల్యాల: ఉపాధి కోసం 20 ఏళ్ల క్రితం గల్ఫ్‌బాట పట్టిన వలసజీవి అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ చాంద్‌పాషాకు విన్నవించారు. మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన లింగాల ముత్తయ్య(55) ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. ఇటీవల దుబాయ్‌లో పనిచేసే చోట గుండె నొప్పి రావడంతో ఆస్పత్రిలో చేరి, చికిత్సపొందుతుండగా, కాంగ్రెస్ రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్‌పాషా అక్కడి కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి, చికిత్సకు సహకరించారు. ఆదివారం తెల్లవారుజామున ముత్తయ్య చికిత్సపొందుతూ మృతిచెందినట్లు సన్నిహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో చాంద్‌పాషా బాధిత కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కృషిచేయాలని కుటుంబ సభ్యులు కోరడంత అక్కడి ఎంబసీ కార్యాలయానికి లేఖరాసి, మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కృషిచేస్తానని చాంద్‌పాషా హామీ ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాల్లో పర్యవేక్షణ కరువు

- రైతులను ఇబ్బంది పెడితే క్షమించం
- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి



ధర్మపురిలో రైతుల సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మపురి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకనే రైతులను నిండ ముంచుతున్నారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనలపై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. గతంలో కంటే ఈసారి ధాన్యం దిగుబడి తక్కువగా వచ్చిందని అకాల వర్షాలతో చేతికందిన పంటలు నీటమునిగాయన్నారు. కాంగ్రెస్ హాయాంలో రైతుల వద్ద కటింగులు లేకుండా కొనుగోలు చేశామని ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు అందించామని కానీ బీఆర్ఎస్ హాయంలో ఎలాంటి వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. తేమ పేరుతో మిల్లర్లు క్వింటాలుకు రెండు, మూడు కిలోల తరుగుతీస్తున్నారని మండిపడ్డారు. ఈసారి పండించిన వరిలో రైతులకు పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొందని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని రైతులు ఎండబెట్టి మ్యాచర్ కోసం నానా తంటాలు పడుతున్నారన్నారు. మిల్లర్ల విషయంలో అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. కటింగుల విషయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవ తీసుకోవాలని తేమపేరుతో ఇబ్బందులు పెట్టకుండా చూడాలని లేకపోతే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, చిలుముల లక్ష్మణ్ తదితరులున్నారు.

చిట్టీ డబ్బుల కోసం గొడవ

- ఒకరి హత్య



హత్యకు గురైన సంతోష్

కోరుట్ల: తాను మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పిస్తే.. ఆ డబ్బులు చెల్లించడం లేదన్న కోపంతో హత్య చేసిన ఘటన కోరుట్ల పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. మెట్‌పల్లి ఎస్సై శ్యాంరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం అంబారిపేటకు చెందిన బోయిని రాజేశ్వర్(32) వ్యక్తి అదే గ్రామానికి చెందిన కాసోజీ సంతోష్(28) అవివాహితుడు. ఏడాదిన్నర క్రితం రూ.1.50 లక్షల చిట్టీ డబ్బులు మధ్యవర్తిగా ఉండి ఇప్పించాడు. ఆ తర్వాత సంతోష్ చిట్టీ డబ్బులు నెలనెలా కడుతున్నప్పటికీ మరో రూ.15వేలు కట్టలేదని దీంతో చిట్టీ గ్రూపు సభ్యులు మధ్యవర్తిగా ఉన్న రాజేశ్వర్‌పై ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి ఇద్దరు కలిసి వెళ్తుండగా కోరుట్ల కేసీఆర్ కాలనీ సమీపంలోని చౌలమద్ది గ్రామ శివారులో మద్యం తాగారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య చిట్టీ డబ్బుల విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో రాజేశ్వర్ పక్కనే ఉన్న కర్రతో సంతోష్ తలపై మోది అక్కడి నుంచి పారిపోయాడు. ఈక్రమంలో చుట్టు పక్కల కాలనీ వాసులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, కోరుట్ల, మెట్‌పల్లి ఎస్సై సతీశ్, శ్యాంరాజ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సంతోష్ తండ్రి సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులను ఇబ్బందిపెడుతున్న మిల్లర్లపై చర్యలేవి

- ధాన్యం సేకరణపై జాప్యమెందుకు? • ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



తిప్పన్నపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతం చూస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్/సారంగాపూర్: రైతులను ఇబ్బందులు పెడుతున్న మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. ఎన్నో రోజులుగా ధాన్యం తూకం వేయడం లేదని, తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. క్వింటాలుకు 5 కిలోల అదనపు తూకం వేస్తున్నారని, దీంతో రైతులు ఎంతో నష్టపోతున్నారన్నారు. మిల్లుకు పంపించిన ధాన్యంలో నాణ్యత లేదని మిల్లర్లు కోత విధిస్తున్నారని, ధర్మకాంట రశీదు ఇవ్వకుండా రైతులను అధిక తూకంతో మోసం చేస్తున్నారన్నారు. రైతులు ధాన్యం కంటింగ్‌కు ఒప్పుకుంటేనే మిల్లర్లు లారీలు అన్‌లోడ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు తూకంపై కమిషనర్‌కు లేఖ రాస్తానన్నారు. సారంగాపూర్ మండలంలోని రేచపల్లి, లచ్చునాయక్‌తండా, మ్యాడారంతండా పరిధిలోని ఐకేపీ, పీఏసీఎస్‌ల పరిధిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పీఏసీఎస్ కేంద్రంలో మూడు రోజులుగా లారీలు రాక తూకం నిలిచిపోయిందన్నారు. కేంద్రం నుంచి వెళ్లిన లారీల్లో ధాన్యం తూకం విషయంలో 40 కిలోల బస్తాకు 3 కిలోల చొప్పున మిల్లర్లు కోత విధిస్తున్నారని, దీనిపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా, మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

పార్టీ పటిష్టతకు పనిచేయాలి

మల్యాల: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త పనిచేయాలని, రైతుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. మల్యాల మండలంలోని ఒబులాపూర్‌కు చెందిన గడ్డం నర్సింహారెడ్డిని మల్యాల మండల కిసాన్ సెల్ అధ్యక్షుడిగా, తాటిపల్లికి చెందిన తూకుంట్ల రవీందర్‌రెడ్డిని ఉపాధ్యక్షుడిగా జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యనారాయణరెడ్డి నియమించారు. సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నియామక పత్రం అందించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజలను చైతన్యపర్చాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనపు తూకం వేస్తూ, రైతులను దోచుకుంటున్నారని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైతుల పక్షాన నిలబడి, రైతుల సమస్యలు పరిష్కరించడంతో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కిసాన్ సెల్ జిల్లా ఇన్‌చార్జి నిడిగొండ శ్రీనివాస్‌రెడ్డి, మల్యాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంచర్ల లక్ష్మణాచారి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగ

- బంగారం, వెండి అభరణాలు, నగదు స్వాధీనం



దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

కోరుట్ల: పట్టణంలో ఈనెల 11న చోరీకి పాల్పడిన దొంగను కోరుట్ల పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే ఈనెల 11న హాజీపురకు చెందిన రిజ్వాన్, ఇమ్రాన్ అనే ఇద్దరి ఇళ్లల్లో చోరీ జరిగింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమరాల ఆధారంగా దొంగను గుర్తించారు. అల్లమయ్య గుట్టకు చెందిన మహమ్మద్ ముజాహిద్ (25)గా గుర్తించి అతడిని ఇంటివద్ద అరెస్టు చేసి విచారించగా చోరీచేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మహమ్మద్ ముజాహిద్ వద్ద నుంచి 2,5 తులాల బంగారం, 6 తులాల వెండి, రూ. 5వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో మరో 8 చోట్ల చోరీకి పాల్పడినట్లు ముజాహిద్ ఒప్పుకున్నాడని, మరింత సమాచారం రాబడుతున్నామని సీఐ వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఇళ్లల్లో సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రమేశ్‌బాబు కాన్వాయ్ అడ్డగింత

- ఎమ్మార్పీఎస్ నాయకులను పక్కకు తప్పించి కాన్వాన్‌ను పంపించిన పోలీసులు



ఎమ్మెల్యే కాన్వాయ్‌కి అడ్డుగా ఉన్నవారిని పక్కకు తీసుకెళ్తున్న పోలీసులు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని చింతకుంటలో వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత వెళ్తున్న కాన్వాయ్‌ను సోమవారం రాత్రి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కాశవత్తుల లక్ష్మిరాజం ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు అడ్డుకున్నారు. చింతకుంటలో పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తక్కళ్లపెల్లిలో దళిత యువకుడు బొడ్డు సాగర్ నెలరోజుల క్రితం అనుమానస్పద స్థితిలో మృతిచెందితే ఇప్పటి వరకు నిజాలు నిగ్గుతేల్చకపోడం దారుణమని మండిపడ్డారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. చింతకుంటలో అంబేడ్కర్ విగ్రహం గద్దెకు బీఆర్ఎస్ జెండాలు కట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, కథలాపూర్ ఎస్సై శ్వేత అప్రమత్తమై ఆందోళనకారులను రోడ్డుపక్కకు లాగి ఎమ్మెల్యే కాన్వాయ్‌ను పంపించడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

రాజన్న ఆలయంలో అనుమానితుల చేతివాటం

- 35 వేల నగదు స్వాధీనం..



అనుమానితుల వద్ద లభించిన నగదు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ సోమవారం అధికంగా ఉంది. ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో వీరినుంచి రూ.9వేలు చోరీకి గురైనట్లు గుర్తించి అక్కడే ఉన్న భద్రత సిబ్బందికి తెలిపారు.దీంతో వారు కోడెమొక్కులు సమర్పించే సమయాన్ని గుర్తించి సీసీ కెమెరాల్లో అనుమానితుల్ని పట్టుకున్నారు. వారిని సోదా చేయగా రూ. 35వేల నగదు లభించింది. సదరు నిందితులు ఒకరు వేములవాడ కాగా మరొకరిది, మంచిర్యాల జిల్లాగా గుర్తించి వారి వద్ద నగదు స్వాధీనం చేసుకుని వేములవాడ టౌన్ పోలీసులకు అప్పగించారు.

రేషన్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లి: పట్టణం నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాజీద్‌ఖాన్, అర్బాజ్‌ఖాన్ అనే ఇద్దరు ఏపీ 29 యూ 7300 నంబర్ గల గూడ్స్ వాహనంలో 30క్వింటాళ్ల రేషన్ బియ్యం నిజామాబాద్ వైపు తరలిస్తుండగా, వెంకట్రావ్‌పేట శివారులో పట్టుకున్నారు. ఈమేరకు బియ్యం సీజ్‌చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అక్రమంగా టేకు దుంగల తరలింపు?

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేట గ్రామశివారు అటవీప్రాంతం నుంచి గుట్టుచప్పుడు కాకుండా విలువైన టేకుదుంగలను తరలిస్తూ.. పలువురు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం గ్రామస్తుడు ఒకరు టేకు దుంగలను తరలిస్తుండగా కొందరు వ్యక్తులు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టుచేయడంతో ఈ విషయం బయటపడింది. అటవీ సంపదను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధచూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన బొమ్మ సాకేత్, మాందాల జాషువా ద్విచక్ర వాహనంపై సిరిసిల్లకు వెళ్లి ఇంటికి వస్తున్నారు. కొలనూర్ శివారులో రైసుమిల్లు వద్ద నిలిపిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.